Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




సంపుటి : 1 | సంచిక : 159 | హైదరాబాద్ | సోమవారం | 19.02.2024 | పేజీలు : 6 | రూ 4/-

## మాకు మూడోసారి అధికారంలోకి రావాలని లేదు - మోదీ కీలక వ్యాఖ్యలు



**తెలంగాణ వీణ , జాతీయం :** 2014 నుంచి కేంద్రంలో వరుసగా రెండుసార్లు గెలిచి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇక 2024 ఎన్నికల్లో మరోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ క్రమంలోనే అనేక ప్రయత్నాలు చేస్తుండగా..అటు..ఎన్డీఏ కూటమిని గద్దె దించాలని ఏర్పాటైన ఇండియా కూటమి రోజురోజుకూ బలహీనపడుతుండటంతో.. తమ విజయం మరోసారి ఖాయమేనని కాషాయ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. మూడోసారి అధికారంలోకి రావాలని తాను కోరుకోవడం లేదని నరేంద్ర మోదీ చెప్పారు. ఆయన అలా ఎందుకు అన్నారంటే?లోక్‌సభ ఎన్నికలకు సమయం ఆసన్నమైన వేళ.. ఢిల్లీలో బీజేపీ పార్టీ శ్రేణులతో రెండు రోజుల సమావేశాలు నిర్వహించింది. ఈ క్రమంలోనే ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న బీజేపీ జాతీయ సమావేశాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ.. కాషాయ పార్టీ శ్రేణులకు ఎన్నికల దిశానిర్దేశం చేశారు. వచ్చే 100 రోజులు అందరికీ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎన్డీయే కూటమికి 400 పైగా సీట్లు రావాలన్నా.. బీజేపీ సొంతంగా 370 సీట్లు గెలవాల్సి ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు.ఈ క్రమంలోనే ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మూడోసారి అధికారంలోకి రావాలని కోరుకోవడం లేదని పేర్కొన్నారు. అధికారం ముఖ్యం కాదని.. దేశం కోసం పనిచేయాలని అన్నారు. తన ఇంటి గురించి ఆలోచించి ఉంటే కోట్లాది మంది ప్రజలకు ఇళ్లు కట్టించే అవకాశం ఉండేది కాదని ప్రధాని తెలిపారు. గత 10 ఏళ్లుగా దేశంలో ఎలాంటి అవినీతి మచ్చ లేకుండా పాలన సాగించామని ప్రధాని మోదీ తెలిపారు. దేశంలోని 25 కోట్ల మంది ప్రజల్ని పేదరికం నుంచి బయటపడేలా చేయడం మామూలు విషయం కాదని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే తాను రాజకీయాల కోసం కాకుండా.. దేశం కోసం పనిచేస్తున్నానని వెల్లడించారు.వచ్చే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 400 సీట్లు గెలుచుకోవడమే లక్ష్యంగా 100 రోజుల్లో ప్రజలందరి విశ్వాసాన్ని చూరగొనాలని ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ నేతలు, కార్యకర్తలకు హితవు పలికారు. ఈ క్రమంలోనే వచ్చే 100 రోజుల్లో మన అందరం ప్రతీ కొత్త ఓటరును, ప్రతీ లబ్ధిదారుడిని, ప్రతి సంఘాన్ని చేరుకోవాలని సూచించారు.



## హైదరాబాద్‌ను చంద్రబాబు, వైఎస్సార్, కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు..

# సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు



- గత ముప్పై ఏళ్లుగా హైదరాబాద్‌ను చంద్రబాబు, వైఎస్సార్, కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు
- ఫైర్ సేఫ్టీ డిపార్ట్ మెంట్ లో కమాండ్ కంట్రోల్ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉంది
- రింగ్ రోడ్డు చుట్టూ ట్రైన్ సదుపాయం కూడా తీసుకు రాబోతున్నాం
- అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ పక్కన ప్రమాద డ్రగ్ తయారీ కంపనీ ఏర్పాటు సరైనది కాదు
- పరిపాలన పై నాకు కొంత సమయం కావాలి
- అపోహాలకు లోను కాకండి,ఎవరు కుడా ప్యానిక్ అవ్వాల్సిన అవసరం లేదు

**తెలంగాణవీణ, హైదరాబాద్ :** గత ముప్పై ఏళ్లుగా చంద్రబాబు, వైఎస్ ఆర్, కేసీఆర్ హైదరాబాద్ ను ఎంతో అభివృద్ధి చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అగ్నిమాపక విభాగం యొక్క అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రధాన కార్యాలయాన్ని ఆదివారం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పట్నం మహెందార్ రెడ్డి, తెలంగాణ ఫైర్ శాఖ డిజి నాగిరెడ్డి, హోం ప్రనిస్పల్ సెక్రెటరీ జితేందర్, సౌమ్య మిశ్రా ఇతరఅధికారులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. ఫైర్ సేఫ్టీ డిపార్ట్ మెంట్ లో కమాండ్ కంట్రోల్ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఫైర్ డిపార్ట్ మెంట్ అనేది కేవలం అగ్ని ప్రమాదాలు కోసమే కాదు, విపత్తకర పరిస్థితుల్లో కూడా వీరు సేవలు అందిస్తూ ఉంటారని తెలిపారు. ప్రాణాలు తెగించి అందరి ప్రాణాలు కాపాడడంలో ఫైర్ డిపార్ట్ మెంట్ కీలకమన్నారు. ఎన్నో వేలాది నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే ఫైర్ డిపార్ట్ మెంట్ కి భవనం లేకపోవడం మంచిది కాదన్నారు. ఏ నగరంలో శాంతి భద్రతలు ఉంటాయో ఆ నగరం అభివృది చెందుతుందన్నారు. గత ముప్పై ఏళ్లుగా చంద్రబాబు, వైఎస్ ఆర్, కేసీఆర్ హైదరాబాద్ ను ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. రాజకీయాలు కు అతీతంగా వారు తీసుకున్న నిర్ణయాలు, అనుభవాలు ను మా ప్రభుత్వం ముందుకు తీసుకెళుతుందన్నారు. హైదరాబాద్ కు ముందుగా ఔటర్ రింగ్ రోడు ను చంద్రబాబు ప్రతిపాదన చేశారని, దాన్ని కొనసాగిస్తూ వైఎస్ ఆర్ పూర్తి చేశారని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డును త్వరలో తీసుకోస్తామన్నారు. రింగ్ రోడ్డు చుట్టూ ట్రైన్ సదుపాయం కూడా తీసుకు రాబోతున్నామన్నారు. హైదరాబాద్ తో తెలంగాణ రాష్ట్ర మొత్తం అభివృద్ధి చెందేలా ప్లాన్ చేశామమన్నారు. 2050 మెగా మాస్టర్ ప్లాన్ ద్వారా ముందుకు పోతామన్నారు. అర్బన్ తెలంగాణా, రూరల్ తెలంగాణా ను అభివృద్ధి చేస్తామన్నారు. ఫార్మ సిటీ కట్టలేదని కొంత మంది ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ పక్కన ప్రమాద డ్రగ్ తయారీ కంపనీ ఏర్పాటు సరైనది కాదన్నారు. ఫార్మ్ సిటీలో మీరు ప్లాన్ చేస్తే మేము పల్లె లో ప్లాన్ చేస్తున్నామని, 10 నుండి 15 విలేజ్ లో ఫార్మ ను ప్లాన్ చేస్తున్నామన్నారు. ఒకే ప్రాంతము 25 వేల ఎకరాల్లో ఫార్మ తీసుకొస్తే నగరం అంత కలుషితం అవుతుందని, అపోహాలకు ఎవరు లోను కాకండని సూచించారు. రాజకీయంగా నాకు అవగాహన ఉంది, నిర్మాణంలో నిర్మాణ సంస్థలతో చర్చిస్తామన్నారు. మేము అంతకు మేము అపర మేధావులు అని నిర్ణయాలు తీసుకోబోమన్నారు. అలా నిర్ణయాలు తీసుకుంటే.. మేడి గడ్డ అవుతుందన్నారు. పరిపాలన పై నాకు కొంత సమయం కావాలి, ఎవరు కుడా ప్యానిక్ అవ్వాల్సిన అవసరం లేదన్నారు. అవగాహన లేకుండా అనుమతులు ఇస్తూ సంతకాలు పెడితే మాజీ HMDA డైరెక్టర్ బాలకృష్ణ పరిస్థితి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు.

## తెలంగాణలో భారీగా ఏసీపీ అధికారులు బదిలీ

**తెలంగాణవీణ, హైదరాబాద్ :** తెలంగాణలో అధికారుల బదిలీల పర్వం కొనసాగుతోంది. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం సూచన మేరకు ఈ బదిలీలు జరుగుతున్నాయి. అయితే.. పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో రాష్ట్రంలోని పలు కీలక శాఖలో భారీగా బదిలీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ వ్యాప్తంగా 61 మంది ఏసీపీ అధికారులను బదిలీ చేస్తున్నట్లు డీజీపీ రవి గుప్త ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉంటే శనివారం 12 మంది అడిషనల్ ఎస్పీలను బదిలీ చేశారు. ఎన్నికల సంఘం సూచనలతో ప్రభుత్వ అధికారులు.. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్లు, డీఎస్పీలు, ఆర్డీవోలు, ఐపీఎస్ అధికారులు, అడిషనల్ కలెక్టర్లను బదిలీ చేశారు.

## మేడారానికి హెలికాప్టర్ లో వెళ్లొచ్చు..

**తెలంగాణవీణ,మేడారం :** మేడారం వెళ్లే భక్తులకు తెలంగాణ పర్యాటకశాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. జాతరకు బస్సుల్లోనే కాదు ఇక నుంచి హెలికాప్టర్‌లోనూ వెళ్లొచ్చు. ఈనెల 21 నుంచి 24 జాతర జరగనుండగా.. హనుమకొండ నుంచి హెలికాప్టర్‌లో వెళ్లేందుకు వీలు కల్పించారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభమైంది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా.. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అమ్మలకు మొక్కులు చెల్లించుకునేందుకు లక్షలాదిగా తరలివస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి జాతర కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఇక ప్రైవేటు వాహనాల్లో వెళ్లేవారు సరేసరి. ఈసారి కూడా మేడారం భక్తులకు హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ నెల 21 నుంచి 25 వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. మేడారం భక్తుల కోసం పర్యాటకశాఖ గతంలో హెలికాప్టర్ సేవలు అందించిన సంస్థతోనే ఒప్పందం కుదుర్చుకుంది. ధరల వివరాల ఒకటి రెండు రోజుల్లో ప్రకటిస్తారు. హనుమకొండ నుంచి హెలికాప్టర్ సేవలు అందుబాటులో ఉంటాయి. ఇలా వెళ్లినవారికి ప్రత్యేక దర్శనం ఉంటుంది. మొక్కులు చెల్లించిన తర్వాత తిరుగు ప్రయాణం ఉంటుంది.









తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేల్చుదాం..


# హైదరాబాద్

## “ఛత్రపతి శివాజీ 394 వ జయంతి” సందర్భంగా “రక్తదాన శిబిరం”

### ముఖ్యఅతిథిగా తుంగతుర్తి రవి






**తెలంగాణ వీణ /ఉప్పల్ :** ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏ డి ఆర్ ఎం బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో “ఛత్రపతి శివాజీ “ 394వ జయంతి సందర్భంగా ఆదివారం నాడు ఉప్పల్ డిపో ఏఐఎస్ఎఫ్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరైనారు. 50 మంది విద్యార్థి , యువత రక్త దానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీక ఛత్రపతి శివాజీ మహారాజ్ అని అన్ని వర్గాల ప్రజల కోసం వారి అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప యోధుడు అని, దేశంలో ఉన్న యువత వారిని ఆదర్శంగా తీసుకొని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తురన్నారని అన్నారు. రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేయడంతో ఆపదలో ఉన్న వారికి రక్తం దానం చేయడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడవచ్చు. ఇంకా అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శి చిన్న, ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, అక్షిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిట్టు, పవన్ , యశ్వంత్ , పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కవిడ కుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజు, వినీల్ , మహేష్ , రాకేష్ , హరీష్ , రాహుల్ , తదితరులు పాల్గొన్నారు.

## బాబాసాహేబ్ కు ఘన నివాళి

### జ్ఞాన మాల సమర్పించిన మేజర్ చంద్రకాంత్ & ఎర్ర శివప్రసాద్,





**తెలంగాణ వీణ /ఉప్పల్ :** ఉప్పల్ జైభీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతి వారం ప్రపంచ మేదావికి మణిహారం కార్యక్రమంలో భాగంగా 184వ వారం ఉప్పల్లోని నాలెడ్జి పార్క్ లో గల బోదిసత్వ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహంనకు తమ జన్మదినాన్ని పురస్కరించుకొని భారతీయ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ మేజర్ చంద్రాంత్, బహుజన విద్యార్థి నేత ఎర్ర శివప్రసాద్ లు జ్ఞాన పూల మాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు బాబాసాహెబ్ కు ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారిరువురికి పలువురు జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బారతీయ బౌద్ద సంఘం రాష్ట్ర నేత డాక్టర్ సతయ్య, నవనీత్ కాంబ్లే, ఫస్ట్ సౌండ్ ఇంజనీరింగ్ ఇండియా అధినేత సాజిద్ ఖాన్, అరుంధతియ సంక్షేమ సంఘం అధ్యక్షులు సిలువెరు నర్సింహ, జై భీమ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్ర బాలరాజు, ఉపాధ్యక్షులు బలపొచయ్య, కోశాధికారి రాపోలు రవి, ప్రధాన కార్యదర్శి మస్కా దనరాజు, నాగొలు రమేష్, సాయిప్రసాద్, రాకేష్, సలహాదారు జోన్నపల్లీ క్రాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ రావు నగర్ డివిజన్లో టేస్టీ ఫ్లైర్ రెస్టారెంట్ హోటల్ ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి

**తెలంగాణ వీణ /ఉప్పల్ :** ఆదివారం యల్ ఐ జి , ఏపి11c ,కాలనీ కుషాయిగూడ, ఈ సీ ఐయల్ లో టేస్టీ ఫ్లైర్ రెస్టారెంట్ హోటల్ ప్రారంబోత్సవ కార్యక్రమానికి ముక్య అతిథి గా గౌరవ శాసన సభ్యులు బండారి లక్ష్మా రెడ్డి పాలోన్నారు .ఈ కార్యక్రమంలో,శ్రీహరి లితున్ మనోహర్ , జంపాల్ ,మహేష్ గౌడ్ , అజిత్ తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.



## రాజ్యాంగం మార్చటం ఖాయం’ : సిపిఐ నారాయణ

**తెలంగాణవీణ, హైదరాబాద్ :** బీజేపీ మూడోసారి గెలిస్తే..ప్రస్తుతమున్న భారత రాగ్యాంజాన్ని మార్చటం ఖాయమని సీపీఐజాతీయ కార్యదర్శి నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశానికి ప్రథమ శత్రువులు బీజేపీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా అని దుయ్యబట్టారు. విభజన హామీలు నెరవేర్చకుండా అటు తెలంగాణకు, ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఇటు ఏపీకి తీవ్ర అన్యాయం చేశారని నారాయణ మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల సమస్యలు గాలికి వదిలేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో పంటలకు గిట్టుబాటు ధరలు లేక.. తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో రైతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ సర్కారు.. దేశం సంక్షేమాన్ని పక్కన పెట్టి.. తమ స్నేహితులైన అదానీ, అంబానీల సంక్షేమం కోసమే పని చేస్తోందని నారాయణ




తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అయోధ్య రాముడి పేరుతో లబ్ధి పొందాలని మోదీ చూస్తున్నాడని.. చెప్పుకొచ్చారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే.. దేశ రాజ్యాంగాన్ని మార్చే అవకాశాలు ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు నారాయణ.


## మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**తెలంగాణ వీణ /ఉప్పల్ :** చిలుకానగర్ లో మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు డా॥సి. హెచ్.భద్రారెడ్డి,





## నూతన వధూవరులను ఆశీర్వదించిన టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ అర్షం అశోక్



**తెలంగాణ వీణ /వరంగల్ ప్రతినిధి:** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ గ్రామానికి చెందిన పత్తిపాక సాంబయ్య మణేమ్మ దంపతుల ఏకైక కుమారుడు సుమన్ రమ్య నెక్కొండ మండల కేంద్రం కళ్యాణీ మండపంలో వివాహ మహోత్సవంలో పాల్గొన్ని నూతన వధూవరులను ఆశీర్వదించిన టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ అర్షం అశోక్ వారితో పాటు వధూవరులను ఆశీర్వదించిన పిట్టల రాజమౌళి అర్షం నగేష్ తుప్పరి రమేష్ అర్షం సతీష్ తదితరులు పాల్గొన్నారు

# గరుడ వాహనంపై గోవిందుడు





**తెలంగాణవీణ (నెల్లూరు జిల్లా) :-** పొదలకూరు పట్టణంలోని అయ్యప్ప నగర్ లో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా నాల్గవ రోజైన శనివారం గరుడ వాహనంపై గోవిందుని గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మలయప్ప స్వామీ ఇరువురి దేవేరులతో కలిసి పొదలకూరు పట్టణ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. బ్రహ్మోత్సవాలకు వాహనాల్లో ఊరేగే స్వామివారిని దర్శించుకోవడానికి జనంతో పోటెత్తారు.స్వామివారు ఆభరణాలు ధరించి గరుడ వాహనంలోనూ ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.స్వామి వారి వాహన సేవల్లో అత్యంత కీలకమైనది గరుడ వాహన సేవ గా భక్తులకు భావిస్తారు. ఈ వాహన సేవల్లో పాల్గొనే భక్తులు శ్రీవారి కృపాకటాక్షాలకు పాత్రులవుతారని, సకల పాపాలు తొలగిపోతాయని జ్ఞానం లభిస్తుందని భక్తుల నమ్మకం.సమస్త వాహనాలలో సర్వశ్రేష్ఠమైంది గరుడవాహనం. గరుడ వాహనంపై ఊరేగే స్వామి వారిని దర్శించుకుంటే.. ఈతి బాధల నుంచి ఉపశమనం లభిస్తుందని విశ్వాసం. స్వామి వారి గ్రామోత్సవంలో భాగంగా శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి మహిళా కోలాటబృందం, శ్రీ దుర్గా భవాని మహిళా కోలాట బృందం పెద్దరాజుపాళెం వారిచే ఆసాన కోలాట గురువు గంగిరెడ్డి ఆధ్వర్యంలో కోలాటం, కాంతారా ఈవెంట్స్,కేరళ వారి వాయిద్యాలు భక్తలను ఆకట్టుకున్నాయి.

# సమ్మక్క-సారలమ్మ జాతర పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**తెలంగాణ వీణ /వరంగల్ ప్రతినిధి :** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రహంపాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా అగ్రంహపాడు జాతరకు వస్తున్న భక్తులకు ఇబ్బంది కలగకుండా రైతు సొంత ఖర్చులతో బావి ఓడలు పోయడాన్ని ఆదివారం పరిశీలించి వారిని అభినందించిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అనంతరం అగ్రహం పాడు జాతర నీటి సదుపాయం కోసం అగ్రంహపాడు మరియు అక్కంపేట గ్రామాలల్లో ఆరు కొత్త బోర్లను ప్రారంభించడం జరిగింది అనంతరం జాతర సమీపంలో నిర్మాణంలో ఉన్న మరుదొడ్లను మరియు ఇతర పనులను దగ్గరుండి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ జడ్పీటీసీ సర్పంచ్లు మండల కమిటీ అధ్యక్షులు సీనియర్ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఒకప్పటి మిత్రులు.. ప్రస్తుతం రాజకీయ ప్రత్యర్థులు..



**తెలంగాణవీణ, ఏపీ బ్యూరో :** ఒకప్పటి మిత్రులు... ప్రస్తుతం రాజకీయ ప్రత్యర్థులు... టిడిపి అధినేత చంద్రబాబు, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాంల మధ్య మాటల యుద్ధం మొదలైంది. బాపట్ల జిల్లా ఇంకొల్లులో జరిగిన రా.. కదలిరా.. బహిరంగ సభలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరాంను ఉద్దేశించి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన ఘాటు వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. 2019 వరకు మనమే గెలించామని, ఆ తరువాత చీరాలలో బలరాంను మనం గెలిపిస్తే, పార్టీ కష్టకాలంలో ఉంటే ఫిరాయించాడని ఘాటు విమర్శలు గుప్పించారు. ఈసారి తనను మరోసారి గెలిపించాలని చీరాలలోని టీడీపీ నేతలను కొరుతున్నాడని, తనను గెలిపిస్తే తిరిగి మన పార్టీలోకి వస్తానంటున్నాడని ఎద్దేవా చేశారు.మనేమేమన్నా అమాయకులమా.. తమ్ముళ్ళూ అంటూ బలరాంకు చురకలు అంటించారు బాబు. మోసం చేసిన వాళ్ళకు బుద్ధి చెప్పాలా... వద్దా.. అంటూ కార్యకర్తలను ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కరణం బలరాంను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై గుర్రుగా ఉన్న కరణం బలరాం అంతే రేంజ్‌లో రియాక్ట్ అయ్యారు. చంద్రబాబు వ్యాఖ్యలను చీరాల ఎమ్మెల్యే కరణం బలరా తీవ్రంగా ఖండించారు. ఇంకొల్లు సభలో తనను దుర్మార్గుడుగా చంద్రబాబు అభివర్ణించారని, తనపై అవాకులు, చవాకులు పేలడం వల్ల తాను కూడా మట్లాడాల్సి వస్తుందన్నారు.చంద్రబాబు నాయుడు కన్నా దుర్మార్గున్ని ఇంతవరకు ఎవరిని చూడలేదన్నారు కరణం. నీ చరిత్ర ఎందో.. నా చరిత్ర ఎందో తేల్చుకుందాం రా.. అంటూ సవాల్ విసిరారు. మీ ఆఫీస్‌కు రమ్మన్నా వస్తాను అంటూ సవాల్ విరిసిరారు.1970 నుంచి ఎవరి చరిత్ర ఏందో అందరికి తెలుసునన్నారు. 2019లో నేను చీరాలకు పోతాను అని అడగలేదని, చంద్రబాబును, తన కొడుకుని చీరాలలో కొంతమంది తిడితే నన్ను అడ్డం పెట్టుకోవడానికి చీరాలకు పంపించారన్నారు. చీరాలలో ప్రజలు తనను పార్టీలతో సంబంధం లేకుండా గెలిపించారన్నారు. .. చీరాలలో నన్ను గెలిపించానని చెబుతున్నావు... నీకంత సత్తా ఉంటే నీ కొడుకు లోకేష్ ను మంగళగిరిలో ఎందుకు గెలిపించుకోలేకపోయావని ప్రశ్నించారు. 2014లో 23 మంది వైసిపి ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్నావు.. ఇలాంటి చర్యలను అప్పుడే ఖండించామన్నారు కరణం బలరాం. పార్టీ ని మోసం చేసి వెళ్లిపోలేదని, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చూస్తే బాగుండదని కరణం హెచ్చరించారు. వైసీపీ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకునే సమయంలో విజయవాడ మనోరమ హోటల్ నుంచి డబ్బు సూట్ కేసులను హైదరాబాద్ ఫామ్ హౌస్ కు ఎవరు తీసుకెళ్లారో మీకు తెలియదా.. అంటూ చంద్రబాబుపై సంచలన ఆరోపణలు చేశారు కరణం బలరాం. ఏదైనా మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు..ఎన్టీఆర్ పెట్టిన పార్టీ... కొన్ని పరిస్థితుల ప్రభావం వలన మీ చేతికి వచ్చిందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన పెద్ద నాయకులను ఏ విధంగా చిత్రహింసలు పెట్టింది తనకు తెలుసన్నారు. పరిటాల రవి, కోడెల శివప్రసాద్ విషయంలో ఇబ్బందులు పెట్టారని కరణం ఆరోపించారు.. వాళ్లు కష్టాల్లో ఉన్నప్పుడు కనీసం వాళ్ళను పరామర్శించలేదు... వీటి గురించి నేను మాట్లాడదలచుకోలేదని, నాపైనే మచ్చలు వేస్తున్నప్పుడు మాట్లాడక తప్పట్లేదన్నారు. అన్ని తప్పులు మీ దగ్గర పెట్టుకొని ఎవరిని బదనాం చేయాలని ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని కరణం బలరాం మండిపడ్డారు. నువ్వు రెచ్చగొడితే... మేము కూడా నీ పైన మాట్లాడాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీలో చాలా కుటుంబాలు బలైపోయాయన్నారు... గతంలో వేమవరంలో ఇద్దరు టిడిపి కార్యకర్తలు చనిపోతే కనీసం పరామర్శించలేని థౌర్భాగ్యస్థితిలో ఉన్నావని దుయ్యబట్టారు. పార్టీ అధికారం లేనప్పుడు కార్యకర్తలే నా ప్రాణం అంటావు.. పోలింగ్ బూతులు దగ్గర కేసులు పెట్టించుకుంటే వాళ్ల గురించి పట్టించుకోవా అని నిలదీశారు. కాంగ్రెస్ లో ఉన్నప్పుడు 1978లో ఇందిరాగాంధీ తనను మూడో కుమారుడిగా అభివర్ణించిందని, తనకు మంత్రి పదవి చేపట్టే అవకాశం ఉన్నా... పివి నరసింహారావుకు నచ్చజెప్పి చంద్రబాబుకు మంత్రి పదవి వచ్చేలా చేశానన్నారు. ముఖ్యమంత్రి అయితే కొమ్ములు వస్తాయా అని ప్రశ్నించారు. ఆ తర్వాత ఎన్టీఆర్ కళ్ళలో పడి టీడీపీ పార్టీలో ఎదిగావని ఎద్దేవా చేశారు. టీడీపీ టికెట్ అడిగానని నిరూపిస్తే, రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు కరణం. రాజకీయ లబ్ధి కోసం తప్పుడు కూతలు కూస్తే బాగుండదని హెచ్చరించారు.

# ఆరోగ్య సూత్రాలను పాటించండి

## - కొచ్చేర్ల కమల రాణి
## - ప్రకృతి ఆశ్రమంలో బిపి




**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో :** ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో శరణ బోధి హాస్పిటల్ నిర్వాహకురాలు కొచ్చేర్ల కమల రాణి ప్రకృతి ఆశ్రమంలో మొదలు పెట్టిన బూడిద గుమ్మడి కాయ జ్యూస్ పంపిణీ కార్యక్రమం వారం పూర్తయిన సందర్భంగా ఆదివారం జ్యూస్ తాగే వారందరికీ బీపీ బరువు తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమల రాణి మాట్లాడుతూ ప్రకృతి ఆశ్రమంలో డైలీ గుమ్మడికాయ జ్యూస్ ను అందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. తక్కువ ధరలకే ఈ జ్యూస్ తో పాటు మిగతా జ్యూస్ లను సైతం అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ గుమ్మడికాయ జ్యూస్ ను తీసుకోవాలని సూచించారు.

# సుప్రసిద్ధ జైన సన్యాసి ఆచార్య విద్యాసాగర్ మహారాజ్ కన్నుమూత



**తెలంగాణ వీణ , జాతీయం :**సుప్రసిద్ధ జైన సన్యాసిఆచార్య విద్యాసాగర్ మహారాజ్ తుదిశ్వాస విడిచారు. చత్తీస్ గఢ్ రాజనందన్ గావ్ జిల్లాలోని చంద్రగిరి తీర్థంలో ఆయన సల్లేఖన ప్రక్రియ ద్వారా కన్నుమూశారు. దేహం నుంచి ప్రాణత్యాగం చేయడానికి జైన సన్యాసులు సల్లేఖన అనే క్రతువును అవలంబిస్తారు. ఇది ఆధ్యాత్మిక సంప్రోక్షణ వంటిది. సల్లేఖన ప్రారంభించాక, ప్రాణాలు పోయేంతవరకు ఎలాంటి ఆహారం స్వీకరించకుండా ఉంటారు. ఆచార్య విద్యాసాగర్ మహారాజ్ కూడా సల్లేఖన స్వీకరించి ఆత్మ త్యాగం చేశారు. ఆయన గత అర్ధరాత్రి దాటాక 2.35 గంటల సమయంలో దేహాన్ని చాలించారని, సమాధి స్థితిలోకి వెళ్లారని చంద్రగిరి తీర్థం ఓ ప్రకటనలో వెల్లడించింది. "ఆచార్య విద్యాసాగర్ మహారాజ్ దొంగర్ గఢ్ లోని చంద్రగిరి తీర్థంలో గత ఆర్నెల్లుగా ఉంటున్నారు. గత కొన్నిరోజులుగా ఆయన అస్వస్థతతో ఉన్నారు. ఈ నేపథ్యంలో మూడ్రోజులుగా సల్లేఖన అవలంబిస్తూ ఎలాంటి ఆహారం స్వీకరించలేదు. కనీసం మంచి నీరు కూడా తాగలేదు" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



**ఆచార్య విద్యాసాగర్ మరణం తీరని నష్టం: ప్రధాని మోదీ**

ప్రముఖ జైనమత సన్యాసి ఆచార్య విద్యాసాగర్ మహారాజ్ కన్నుమూశారన్న వార్త విని ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం దేశానికి తీరని నష్టం అని పేర్కొన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించేందుకు ఆయన కృషి చిరస్మరణీయం అని వివరించారు. "ఆచార్య విద్యాసాగర్ మహారాజ్ తన జీవితాంతం సమాజంలో దారిద్ర్య నిర్మూలన కోసం, ఆరోగ్య పరిరక్షణ, విద్యా వ్యాప్తి కోసం పాటుపడ్డారు. ఆయన ఆశీస్సులు సదా నాపై ఉండేవి... అందుకు నేను చాలా అదృష్టవంతుడ్ని. గతేడాది చత్తీస్ గఢ్ లోని చంద్రగిరి జైన దేవాలయంలో ఆయనతో నా సమావేశం ఎప్పటికీ మర్చిపోలేను. ఆ సమయంలో ఆయన నుంచి ఎంతో ప్రేమను, దీవెనలను పొందగలిగాను. సమాజ హితం కోసం ఆయన అసమాన భాగస్వామ్యం ప్రతి తరం వారికి స్ఫూర్తి కలిగిస్తూనే ఉంటుంది" అంటూ మోదీ వివరించారు. అంతేకాదు, ఆచార్య విద్యాసాగర్ మహారాజ్ ను కలిసినప్పటి ఫొటోలను కూడా పంచుకున్నారు.

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..


# జనరల్

# పవన్ కల్యాణ్‌పై క్రిమినల్ కేసు.. ఎందుకంటే..



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో** : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై గుంటూరు న్యాయస్థానంలో క్రిమినల్ కేసు నమోదైంది. వాలంటీర్లకు వ్యతిరేకంగా అనుచిత వ్యాఖ్యలు చేశారని.. ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించారంటూ.. గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరుకు చెందిన వాలంటీర్ పవన్ కుమార్ ఇచ్చిన వాగ్మూలం ఆధారంగా జనసేన అధినేతపై కేసు నమోదైంది. విచారణకు స్వీకరించిన జిల్లా ప్రధాన న్యాయస్థానం ఐపీసీ సెక్షన్ 499, 500 కింద కేసు నమోదు చేసింది. అంతేకాకుండా ఈ కేసును నాలుగో అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేయడంతోపాటు.. మార్చి 25న గుంటూరు జిల్లా కోర్ట్‌కు హాజరు కావాలని నోటీస్‌లు ఇచ్చింది. జులై 3న ఏలూరులో వారాహి యాత్రలో పాల్గొన్న పవన్ కల్యాణ్.. వాలంటీర్లపై ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళల అదృశ్యం వెనుక వాలెంటీర్ వ్యవస్థ ఉందని పవన్ ఆరోపించినట్లు కేసులో పేర్కొన్నారు. కేంద్ర నిఘా వర్గాల సమాచారం మేరకు రాష్ట్రంలో సుమారు 29వేల నుంచి 30వేల మంది అమ్మాయిలు అదృశ్యమయ్యారంటూ పేర్కొన్నారు. వారిలో 14 వేల మంది తిరిగి వచ్చారని పోలీసులు చెబుతున్నారని, మిగిలినవారి గురించి ముఖ్యమంత్రి ఎందుకు ప్రశ్నించడం లేదంటూ వ్యాఖ్యానించారు.. దీనిపై అప్పట్లోనే వాలంటీర్లతోపాటు.. వైసీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే తాజాగా కేసు నమోదు చేయడం సంచలనంగా మారింది.

# రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమితో పని చేస్తాం..




**తెలంగాణ వీణ , జాతీయం** : రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏకి వ్యతిరేకంగా ఇండియా కూటమితో పని చేస్తామని స్పష్టం చేశారు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ. దేశంలో రాజకీయ పార్టీలను భయపెట్టి పాలన సాగిస్తున్న బీజేపీకి ప్రజల చేతిలో ఓటమి ఖాయమన్నారు. ఈవీఎం టాంపరింగ్‌లను నమ్ముకున్న బీజేపీ 400 సీట్ల మాట మాట్లాడుతుందని, రాష్ట్రంలో జగన్, చంద్రబాబు,తో సహా దేశంలో అనేక మంది సీఎంలు బిజెపికి మోడీకి లొంగిపోయారు అని నారాయణ అన్నారు. వైసీపీ, టీడీపీలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో పోటీ చేసేందుకు సిద్ధం అంటున్నారు.సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ.. "బీజేపీ చెప్పేది పూజలు, చేసేవి బెదిరింపు రాజకీయాలు. దేశంలో ఉన్న ముఖ్యమంత్రులను బెదిరించి బీజేపీ తన దారికి తెచ్చుకుంటుంది. ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్న బీజేపీకి నాలుగు వందల సీట్లు ఎలా వస్తాయి?. వాళ్ళు ఈవీఎం టాంపరింగ్‌ను నమ్ముకున్నారేమో !. ఇండియా కూటమిని విచ్ఛిన్నం చేయాలని బీజేపీ ప్రయత్నం చేస్తుంది. అందుకే అరవింద్ కేజ్రీవాల్ లాంటి నాయకుడిని కూడా బీజేపీ తన గుప్పెట్లోకి బంధించింది. జాతీయ స్థాయిలో ఎన్డీఏకి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం. ఇండియా కూటమితో పనిచేస్తాం.రాష్ట్రంలో మోడీ అడుగులకు, జగన్ ,చంద్రబాబు మడుగులు వత్తుతున్నారు. రాష్ట్రంలో వైసీపీ, టీడీపీలకు వ్యతిరేకంగా పోటీ చేస్తాం. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కూటమితో ఎన్నికల బరిలో దిగుతాం." అని ఆయన వెల్లడించారు.

# ఆ రోజున "వీరమల్లు" జాతర..

**తెలంగాణ వీణ , సినిమా** : పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ నిధి అగర్వాల్ హీరోయిన్ గా బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డియోల్ తదితర నటులు నటిస్తున్న భారీ చిత్రం "హరిహర వీరమల్లు" కోసం తెలిసిందే. విలక్షణ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న ఈ బిగ్గెస్ట్ చిత్రం ఎన్నో ఏళ్ల నుంచి అలా ఆలస్యం అవుతూ వస్తుంది.అయితే ఈ సినిమా విషయంలో మేకర్స్ సాలిడ్ అప్డేట్స్ ఎప్పటికప్పుడు ఇవ్వడం ఆపడం లేదు. అలా రీసెంట్ గానే ఈ చిత్రం నుంచి మరో ఇంట్రెస్టింగ్ ట్రీట్ వస్తున్నట్టుగా మేకర్స్ కన్ఫామ్ చేయగా ఇప్పుడు ఇదెప్పుడు అనేది తెలుస్తుంది. లేటెస్ట్ టాక్ ప్రకారం వీరమల్లు జాతర ఈ మహా శివరాత్రి కానుకగా అయితే ఉంటుంది అని తెలుస్తుంది.అంటే ఈ మార్చ్ 8న వీరమల్లు నుంచి మరో ట్రీట్ రాబోతుంది అని చెప్పాలి. ఇక దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది. అలాగే ఈ చిత్రానికి ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా నిర్మాత ఏ ఎం రత్నం పవన్ కెరీర్ లో నిలిచిపోయే మరో చిత్రంగా నిర్మిస్తున్నామని తెలిపారు.



# చంద్రబాబు కటౌట్ కు బుద్దా వెంకన్న రక్తాభిషేకం



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో** : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తనకు దేవుడితో సమానమని పార్టీ సీనియర్ నేత బుద్దా వెంకన్న చెప్పారు. ప్రాణం ఉన్నంత వరకూ ఆయనకు విధేయుడిగా ఉంటానని పేర్కొన్నారు. తన రక్తంలోని చివరి బొట్టు వరకూ ఆయనకే ధారబోస్తానని చెప్పుకొచ్చారు. ఇది నిరూపించుకోవడానికి ఆదివారం చంద్రబాబు కటౌట్ కు బుద్దా వెంకన్న రక్తాభిషేకం చేశారు. తన శరీరంలో నుంచి రక్తం తీసి చంద్రబాబు కటౌట్ పాదాలకు అభిషేకం చేయడంతో పాటు గోడపై సీబీఎన్ జిందాబాద్, నా ప్రాణం మీరే.. అంటూ నినాదం రాశారు. అనంతరం బుద్దా వెంకన్న మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు తనకు దేవుడని, ప్రాణం ఉన్నంత వరకూ ఆయనకు విధేయుడిగా ఉంటానని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలలో విజయవాడ వెస్ట్ లేదా అనకాపల్లి టికెట్ ఇవ్వాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశానని చెప్పారు. అనకాపల్లి పార్టీ టికెట్ విషయంలో ఎవరెవరి పేర్లో వినిపిస్తున్నాయని, విజయవాడ వెస్ట్ నియోజకవర్గం విషయంలో ఎవరి పేర్లూ వినిపించడంలేదన్నారు. రాష్ట్రంలో, దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలే ఏర్పడబోతున్నాయని, కీలకమైన విశ్వాసపాత్రులైన వారికి టికెట్ ఇవ్వాలని పార్టీ అధిష్ఠానానికి ఆయన సూచించారు. చివరగా.. తనకు టికెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా 'జై చంద్రబాబు' అనే అంటానని, చంద్రబాబుపై ఎవరు విమర్శలు చేసినా ఊరుకోబోనని బుద్దా వెంకన్న స్పష్టం చేశారు.

# తెలంగాణ ఫైర్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ కార్యాలయం ప్రారంభించిన సీఎం

**తెలంగాణ వీణ , హైదరాబాద్** : అగ్నిమాపక విభాగం యొక్క అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రధాన కార్యాలయాన్ని ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి పట్నం మహేందార్ రెడ్డి, తెలంగాణ ఫైర్ శాఖ డిజి నాగిరెడ్డి, హోం ప్రనిస్పల్ సెక్రెటరీ జితేందర్, సౌమ్య మిశ్రా ఇతరఅధికారులు, ఫైర్ సిబ్బంది పాల్గొననున్నారు.ఫైర్ సేఫ్టీ డిపార్ట్ మెంట్ లో కమాండ్ కంట్రోల్ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఫైర్ డిపార్ట్ మెంట్ అనేది కేవలం అగ్ని ప్రమాదాలు కోసమే కాదు, విపత్తకర పరిసితుల్లో కూడా వీరు సేవలు అందిస్తూ ఉంటారని తెలిపారు. ప్రాణాలు తెగించి అందరి ప్రాణాలు కాపాడడంలో ఫైర్ డిపార్ట్ మెంట్ కీలకమన్నారు. ఎన్నో వేలాది నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే ఫైర్ డిపార్ట్ మెంట్ కి భవనం లేకపోవడం మంచిది కాదన్నారు. ఏ నగరంలో శాంతి భద్రతలు ఉంటాయో ఆ నగరం అభివృది చెందుతుందన్నారు. గత ముప్పై ఏళ్లుగా హైదరాబాద్ నగరం అభివృద్ధిలో చంద్రబాబు, వైఎస్ ఆర్, కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. రాజకీయాలు కు అతీతంగా వారు తీసుకున్న నిర్ణయాలు, అనుభవాలు ను మా ప్రభుత్వం ముందుకు తీసుకెళుతుందన్నారు. హైదరాబాద్ కు ముందుగా ఔటర్ రింగ్ రోడ్డు ను చంద్రబాబు ప్రతిపాదన చేశారని, దాన్ని కొనసాగిస్తూ వైఎస్ ఆర్ పూర్తి చేశారని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు ను త్వరలో తీసుకోస్తామన్నారు. రింగ్ రోడ్డు చుట్టూ ట్రైన్ సదుపాయం కూడా తీసుకు రాబోతున్నామన్నారు.హైదరాబాద్ తో తెలంగాణ రాష్ట్ర మొత్తం అభివృద్ధి చెందేలా ప్లాన్ చేశామన్నారు. 2050 మెగా మాస్టర్ ప్లాన్ ద్వారా ముందుకు పోతామన్నారు. అర్బన్ తెలంగాణా, రూరల్ తెలంగాణా ను అభివృద్ధి చేస్తామన్నారు. ఫార్మ సిటీ కట్టలేదని కొంత మంది ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. అంతరాతీయ ఎయిర్ పోర్ట్ పక్కన ప్రమాద డ్రగ్ తయారీ కంపనీ ఏర్పాటు సరైనది కాదన్నారు. ఫార్మ సిటీలో మీరు ప్లాన్ చేస్తే మేము పల్లె లో ప్లాన్ చేస్తున్నామని, 10 నుండి 15 విలేజ్ లో ఫార్మ ను ప్లాన్ చేస్తున్నామన్నారు. ఒకే ప్రాంతము 25 వేల ఎకరాల్లో ఫార్మ తీసుకొస్తే నగరం అంత కలుషితం అవుతుందని, అపోహాలకు ఎవరు లోను కాకండని సూచించారు. రాజకీయంగా నాకు అవగాహన ఉంది, నిర్మాణంలో నిర్మాణ సంస్థలతో చర్చిస్తామన్నారు. మేము అంతకు మేము అపర మేధావులు అని నిర్ణయాలు తీసుకోబోమన్నారు. అలా నిర్ణయాలు తీసుకుంటే.. మేడి గడ్డ అవుతుందన్నారు. పరిపాలన పై నాకు కొంత సమయం కావాలి, ఎవరు కుడా ప్యానిక్ అవ్వాల్సిన అవసరం లేదన్నారు. అవగాహన లేకుండా అనుమతులు ఇస్తూ సంతకాలు పెడితే మాజీ HMDA డైరెక్టర్ బాలకృష్ణ పరిస్థితి వస్తాదన్నారు.




# కొణిదెల వారి రుచులు

**తెలంగాణ వీణ , సినిమా** : అల్లు రామలింగయ్య కుమార్తె, మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ తన పుట్టినరోజు నాడు కొత్త ఫుడ్ బిజినెస్ మొదలుపెట్టినట్లు ప్రకటన వెలువడింది. నిజానికి ఆమె కొత్త బిజినెస్ లోకి దిగుతున్నారు అనే ప్రచారం కొద్దిరోజుల నుంచి జరుగుతోంది. ఇప్పటివరకు హౌస్ వైఫ్ గా ఉన్న ఆమె ఒకవేళ నిర్మాతగా వ్యవహరిస్తారు అనే ప్రచారం జరిగింది కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఆమె ఫుడ్ బిజినెస్ ప్రారంభించినట్లు ఆమె కోడలు ఉపాసన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఎక్కడ ఉన్నామనే విషయం పక్కన పెడితే సౌత్ ఇండియన్ ఫుడ్ మిస్ అవ్వకుండా చేసేలా ఈ అత్తమ్మాస్ కిచెన్ వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. అంతే కాదు ప్రస్తుతానికి నాలుగు ప్రొడక్ట్స్ అమ్మకానికి కూడా పెట్టారు. అందుకుగాను ఒక వెబ్సైట్ (https://athammaskitchen.com/) కూడా అందుబాటులో తీసుకొచ్చారు.ప్రస్తుతానికి ఉప్మా మిక్స్, పులిహోర పేస్ట్, పొంగల్ మిక్స్, రసం పౌడర్ నాలుగింటిని అమ్ముతున్నారు. ఈ నాలుగు కలిపి కొనాలనుకునే వారికి 1100 రూపాయలు ఛార్జ్ విధిస్తున్నారు. తన అత్తమ్మ పుట్టినరోజు నాడే ఈ కొత్త వెంచర్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడం చాలా గర్వంగా ఉందని ఈ సందర్భంగా ఉపాసన వెల్లడించారు. ముఖ్యంగా సొంత ఇంట్లో లేని వారు అంటే బ్యాచిలర్స్ లేదా సొంత ప్రాంతానికి దూరంగా ఉంటున్న వారు వీలైనంత త్వరగా సౌత్ ఇండియన్ డిషెస్ తయారు చేసుకునేందుకు ఈ వెంచర్ స్టార్ట్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతానికి ఇండియాలో మాత్రమే ఈ బిజినెస్ మొదలుపెట్టినా త్వరలోనే విదేశాల్లో ఉన్న తెలుగు వారు సౌత్ ఇండియన్ పీపుల్ కి అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఇంకెందుకు ఆలస్యం కొణిదెల వారి ఇంటి రుచులు చూడాలంటే మీరు కూడా ఆర్డర్ చేసుకొని వంట చేసుకుని తినండి మరి.






# జగన్ పై లోకేశ్ ఫైర్



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో** : విశాఖపట్నంను ఐటీ క్యాపిటల్ గా చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తే.. జగన్ ప్రభుత్వం సిటీని గంజాయి క్యాపిటల్ గా మార్చేసిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. టీడీపీ హయాంలో చంద్రబాబు నెలకొక ఐటీ కంపెనీని నగరానికి తీసుకొచ్చారని చెప్పారు. ఈమేరకు ఆదివారం విశాఖ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన శంఖారావం సభలో లోకేశ్ ప్రసంగించారు. నాడు చంద్రబాబు నెలకొక ఐటీ కంపెనీని విశాఖకు తీసుకొస్తే.. ప్రస్తుతం జగన్ పాలనలో నగరంలో రోజుకో హత్య, కిడ్నాప్, కుంభకోణం జరుగుతున్నాయని లోకేశ్ ఆరోపించారు. విశాఖను విషాదపట్నంగా మార్చేశారని జగన్ పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విశాఖ ఉక్కు కంపెనీ విషయంలో జగన్ లాలూచి పడ్డారని, కంపెనీని ప్రైవేటుకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అయితే, దీనిని టీడీపీ అడ్డుకుంటుందని, వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడేందుకు చర్యలు చేపడతామన్నారు. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని లోకేశ్ వివరించారు.నగరానికి రైల్వే జోన్ తెస్తా.. మెట్రో ప్రాజెక్టు తీసుకొస్తానని ఇచ్చిన హామీలను జగన్ మర్చిపోయారని లోకేశ్ ఎద్దేవా చేశారు. అయితే, సూపర్ 6 పేరుతో చంద్రబాబు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని చెప్పారు. ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి, మహిళలకురూ.1500అందిస్తామనిలోకేశ్ వివరించారు.


# వాహనదారులకు బిగ్ అలర్ట్..



**తెలంగాణ వీణ , జనరల్ :** రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి.. నిబంధనలన్నీ మారిపోతున్నాయి. ఇక.. హైదరాబాద్ ట్రాఫిక్‌పై రేవంత్ రెడ్డి ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా.. ఇప్పటికే పలుమార్లు సమీక్షించిన రేవంత్.. ఇప్పటికే పోలీసులకు కీలక సూచనలు చేసింది. అయితే.. ట్రాఫిక్ సమస్యను దూరం చేసేందుకు.. అవసరమైతే ట్రాఫిక్ నిబంధనలు కూడా మార్చడానికి వెనకాడొద్దని సంబంధిత అధికారులకు సర్కారు నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. దీంతో.. హైదరాబాద్ సీపీ, ట్రాఫిక్ అధికారులు రంగంలోకి దిగారు.హైదరాబాద్‌లో ట్రాఫిక్ రూల్స్‌పై సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఇప్పటి నుంచి నిరంతరం ట్రాఫిక్ నియంత్రణ చర్యలను తీసుకుంటామన్నారు. పార్కింగ్ ఆక్రమణలు, ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. రూల్స్ ఫాలో అవ్వకపోతే చలాన్ వేసి.. ముక్కుపిండి మరీ వసూలు చేస్తామని స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇచ్చారు. రూల్స్ అతిక్రమిస్తే ఎవ్వరిని వదిలే ప్రసక్తే లేదన్నారు సీపీ.గూడ్స్ వాహనాల వల్ల నగరంలో భారీగా ట్రాఫిక్ పెరిగి పోతుందని.. వాటికి కేటాయించిన సమయంలో మాత్రమే సిటీలోకి రావాలని సీపీ సూచించారు. మిగతా సమయంలో వస్తే చలాన్లు వేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్‌పై కొత్త నిబంధనలు తీసుకొస్తున్నట్టు సీపీ తెలిపారు. ట్రాఫిక్ లెస్ సిటీగా హైదరాబాద్ మారనుందన్నారు. ట్రాఫిక్ రోడ్ సేఫ్టీ మంత్ నిర్వహిస్తున్నామని ప్రకటించారు సీపీ.అర్బన్ ప్రజలకు ట్రాఫిక్‌పై అవగాహన ఇస్తున్నామని సీపీ తెలిపారు. ఇప్పటివరకు 150 కార్యక్రమాలు నిర్వహించామని.. ఇందులో 35 వేల మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంటి నుంచి బయటకొచ్చిన ప్రతి ఒక్కరు సేఫ్‌గా తిరిగి వెళ్లాలని సూచించారు. వాహనాలను ఓవర్ రాష్ డ్రైవింగ్ చేసి ఇంట్లోవారికి విషాదాన్ని మిగల్చొద్దని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# ఉప్పే కాదు.. అది కూడా గుండెకు చేటే..!

**తెలంగాణ వీణ , జనరల్ :** ఇటీవలి కాలంలో హృద్రోగ సమస్యలు పెరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా భారత దేశంలో గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య ఎక్కువవుతోందని గణంకాలు చెబుతున్నాయి. కరోనా మహమ్మారి ఇది మరింత ఎక్కువైందని చెప్పాలి. చిన్న వయసులో ఉన్న వారు సైతం గుండెపోటుతో మరణిస్తుండడం అందిరనీ షాక్‌కి గురి చేస్తోంది.ఇదిలా ఉంటే గుండె పోటుకు ప్రధాన కారణాల్లో శారీరకశ్రమ లేకపోవడం ఒకటైతే. ఉప్పు, అనారోగ్య కొవ్వులు ఎక్కువగా తీసుకోవడమే ప్రధాన కారణంగా చెబుతుంటారు. ఉప్పు అధికంగా తీసుకునే వారిలో గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతుంటారు. అందుకే వీలైనంత వరకు ఉప్పును తగ్గించాలని సూచిస్తుంటారు. అయితే కేవలం ఉప్పు మాత్రమే కాదు, చక్కెర కూడా గుండెకు చేటు చేస్తుందని తాజా పరిశోధనల్లో వెల్లడైంది.



షుగర్ అధికంగా ఉన్న ఆహారం.. శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచుతుందని పరిశోధకులు చెబుతున్నారు. అమెరికాలోని టెక్సాస్ ఏ అండ్ ఎం వర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన శాస్త్రవేత్తలు చేపట్టిన పరిశోధనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈ విషయమై క్లేటన్ క్రూగర్ అనే శాస్త్రవేత్త మాట్లాడుతూ.. 'అధిక ఇన్‌ఫ్లమేషన్ వల్ల గుండె, మూత్రపిండాల్లోని రక్తనాళాలు దెబ్బతినొచ్చు. ఇది గుండె సమస్యలకు, పక్షవాతానికి దారితీయవచ్చు. గుండె రక్తనాళాల్లో ఇన్‌ఫ్లమేషన్ వల్ల థ్రాంబస్ లేదా రక్తగడ్డలు ఏర్పడవచ్చు. ఫలితంగా గుండెలోని భాగాలకు ఆక్సిజన్, పోషకాలు అందని పరిస్థితి వస్తుంది. ఇది దీర్ఘకాల ఇన్‌ఫ్లమేషన్.. గుండె వైఫల్యానికి దారితీస్తుంది. అలాంటి పరిస్థితుల్లో శరీరానికి సరిపడినంత రక్తాన్ని ఆ అవయవం పంప్ చేయదు' అని చెప్పుకొచ్చారు.ఇక అధికంగా చెక్కర తీసుకుంటే.. ఊబకాయం, టైప్-2 డయాబెటిస్‌కు కారణమవుతుందని క్లేటన్ పేర్కొన్నారు. దీంతో హృద్రోగాలు, పక్షవాతం, నాడులు దెబ్బతినడం, మూత్రపిండాల వైఫల్యం, చూపు, వినికిడి సామర్థ్యం తగ్గిపోవడం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని కూడా చెప్పుకొచ్చారు. అయితే పండ్ల, కూరగాయల్లో ఉండే నేచురల్ చక్కెరలు శరీరంపై పెద్దగా ప్రభావం చూపయని పరిశోధకులు చెబుతున్నారు. రిఫైన్డ్ చక్కెరలాగా ఇవి రక్తంలో షుగర్ స్థాయిని పెంచవని చెప్పుకొచ్చారు.

# సింహాద్రి అప్పన్న సేవలో నారా లోకేశ్

**తెలంగాణ వీణ , జనరల్ :** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ ఉదయం సింహాద్రి అప్పన్నను దర్శించుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న లోకేశ్ బేడ మండపం వద్ద ప్రదక్షిణ చేశారు. అనంతరం అంతరాలయంలో స్వామిని దర్శించుకున్నారు. లోకేశ్ పేరిట అర్చకులు స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు లోకేశ్‌కు స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. లోకేశ్‌తోపాటు పలువురు నాయకులు కూడా పూజలో పాల్గొన్నారు. శంఖారావం యాత్రలో భాగంగా లోకేశ్ నిన్న విశాఖపట్టణం జిల్లా పెందుర్తి మండలంలోని కృష్ణరాయపురం, భీమిలి నియోజకవర్గ పరిధిలోని చిట్టివలస, విజయనగరం జిల్లా సోంపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వాన్ని, సీఎం జగన్‌ను తీవ్రస్థాయిలో ఎండగట్టారు.



# పీచు మిఠాయి తినేవారికి షాక్..!

**తెలంగాణ వీణ , జనరల్ :** పీచు మిఠాయి. దీన్ని చూడగానే ఎవ్వరికైనా నోరు ఊరిపోతుంది. చిన్న పిల్లల నుంచి ముసలి వాళ్ల వరకు చాలా మందికి ఈ పీచు మిఠాయి అంటే ఎంతో ఇష్టం. ఈ పీచు మిఠాయిని ఇంగ్లీష్‌లో కాటన్ క్యాండీ అని పిలుస్తారు. అయితే ఈ కాటన్ క్యాండీపై తాజాగా పుదుచ్చేరి, తమిళనాడు ప్రభుత్వాలు నిషేధం విధించాయి. ఈ పీచు మిఠాయి.. ప్రజల ఆరోగ్యాన్ని చెడగొడుతుందని.. తాజాగా నిర్వహించిన పరిశోధనల్లో తేలింది. దీంతో దానిపై రెండు రాష్ట్రాల సర్కార్లు ఆంక్షలు విధించాయి. మనుషుల ఆరోగ్యంపై పీచు మిఠాయి ప్రతికూల ప్రభావాలను కలిగిస్తుందని తాజాగా చేపట్టిన అధ్యయనాల్లో వెలుగులోకి వచ్చింది. దీంతో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ నిషేధం విధించింది. దీంతో కాటన్ క్యాండీని బ్యాన్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ నిర్ణయం తీసుకున్న రెండు రోజుల్లోనే తాజాగా తమిళనాడు కూడా అదే నిర్ణయం తీసుకుంది.ఈ కాటన్ క్యాండీని వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల పేర్లతో పిలుస్తూ ఉంటారు. ఫెయిరీ ఫ్లాస్, బుద్ధి కే బాల్ అని కూడా ఈ పీచు మిఠాయిని పిలుచుకుంటారు. మన తెలుగు రాష్ట్రాల్లో దీన్ని పీచు మిఠాయి అంటారు. అయితే ఈ కాటన్ క్యాండీని ఒకరకమైన చక్కెరతో తయారు చేస్తారు. అది షుగర్ సిరప్ నుంచి తయారు చేస్తారు. ఒక మిషన్‌లోని చిన్న రంధ్రం నుంచి పోగులు పోగులుగా ఈ పీచు మిఠాయి బయటకు వస్తుంది. ఆ బయటకు వచ్చిన పీచు మిఠాయిని ఒక కర్రపై తీసుకుని వివిధ ఆకృతుల్లో తయారు చేస్తారు. వివిధ రకాల రంగుల్లో తయారు చేసే ఈ పీచు మిఠాయి దూది పింజలా, రుచికి తియ్యగా ఉంటుంది.కొందరు వ్యాపారులు భారీ లాభాలకు ఆశపడి ఈ పీచు మిఠాయిని అత్యంత విషపూరితమైన రసాయనాలతో తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పుదుచ్చేరిలో అనేక దుకాణాలు రోడమైన్ బి అనే డేంజరస్ కెమికల్‌ను ఉపయోగించి ఈ కాటన్ క్యాండీని తయారు చేస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో బయటపడింది. ఆ పీచు మిఠాయి శాంపిల్స్‌లో రోడమైన్-బి అనే విష పదార్థం ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ క్రమంలోనే పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్రంగా పరిగణించారు. దీంతో కాటన్ క్యాండీలు తయారు చేసి విక్రయించే దుకాణాలను తనిఖీ చేయాలని అధికారులకు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే తనిఖీలు చేపట్టిన పుదుచ్చేరి ఫుడ్ సేఫ్టీ అధికారులు.. కొన్ని షాపులను సీజ్ చేశారు.



నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ప్రకారం.. రోడమైన్ బి అనేది ఒక రసాయన సమ్మేళనం. దీన్ని వివిధ రంగుల్లో ఉపయోగిస్తారు. అయితే ఈ రోడమైన్ బి ఆహారం ద్వారా తీసుకుంటే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని.. కాలేయం కూడా దెబ్బ తినే అవకాశాలు ఉన్నాయని డాక్టర్లు హెచ్చరికలు చేస్తున్నారు. ఇక ఈ రోడమైన్ బిని అధిక మోతాదులో తీసుకుంటే విషంతో సమానమని పేర్కొన్నారు. ఇక ఇది రక్తంలో చక్కెర స్థాయిలను భారీగా పెంచుతుందని తెలిపారు.ఈ రోడమైన్ బి శరీరంలోకి చేరిన తర్వాత.. హైపర్ ఆక్టివిటీకి దారి తీసి.. పిల్లల్లో మూడ్ స్వింగ్‌కు కారణం అవుతుందని పేర్కొన్నారు. దీన్ని ఎక్కువగా తినడం వల్ల భారీగా బరువు పెరుగుతారని చెప్పారు. ఇందులోని తీపి.. పళ్లకు కూడా హానికరం చేస్తుందని తెలిపారు. ఇక కాటన్ క్యాండీల్లో ఉపయోగించే కృత్రిమ రంగులు పిల్లల్లో అలెర్జీలకు కారణమవుతాయని.. చర్మంపై దద్దుర్లు, జీర్ణశయ, శ్వాస సమస్యలు తలెత్తుతాయని వెల్లడించారు.

# మేడారంలో తక్షణ వైద్య సేవలు

**తెలంగాణ వీణ , జనరల్ :** వనదేవతల దర్శనం కోసం మేడారం వచ్చే భక్తులకు అవసరమైన వైద్యసేవలు అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. జాతరలో నిరంతర వైద్య సదుపాయం కల్పించాలని ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేయగా.. తాజాగా బైక్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఈ మహాజాతరలో దాదాపు లక్షన్నర మంది జనం తరలివచ్చే అవకాశం ఉన్నందున అత్యవసర సేవలను అందించేందుకు బైక్ అంబులెన్స్ సేవలను జాతరలో ప్రారంభించారు. ఈ మేరకు శనివారం మేడారంలోని గిరిజన మ్యూజియం ఆవరణలో మంత్రి సీతక్క అధికారులతో కలిసి బైక్ అంబులెన్స్ లను ప్రారంభించారు. మొత్తం 40 బైక్ అంబులెన్స్‌లను ప్రారంభించనున్నారు. వాటిలో దాదాపు 21 రకాల మెడికల్ కిట్ అందుబాటులో ఉంటాయని, వాటితో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుందని మంత్రి సీతక్క తెలిపారు.మేడారం జాతరలో ఏటికేడు భక్తుల రద్దీ పెరుగుతోందని, అత్యవసర సమయాల్లో భక్తులకు వైద్యసేవలు అందించేందుకు కొత్త బైక్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. మేడారం జాతరలో భక్తులకు విస్తృతంగా వైద్యసేవలు అందించాలని, పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని మంత్రి సీతక్క సూచించారు. డాక్టర్లు దేవుడితో సమానమని, అమ్మ పుడితే డాక్టర్లు పునర్జన్మ ఇస్తారన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, అన్ని రకాల వైద్య సదుపాయాలు, మందులు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు మంత్రి సీతక్క సూచించారు. జాతరకు వచ్చే భక్తులు సమన్వయంతో వనదేవతలను దర్శించుకోవాలని, అత్యవసర సమయాల్లో సేవలు అందించే అంబులెన్సులకు సహకరించాలని కోరారు.40 బైక్ అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి మేడారం జాతరకు తరలివస్తున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని 40 జీవీకే బైక్ అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచినట్లు మెడికల్ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిరంతరం వైద్య సిబ్బంది ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జంపన్న వాగు పరిసర ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు ఉండేలా చూడాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో క్యూలైన్లలో దర్శనం కోసం వేచి ఉన్న భక్తులకు ఓఆర్ ఎస్ ప్యాకెట్లు, పరిష్కారాలు అందించాలని సూచించారు.







### 50 పడకలతో తాత్కాలిక ఆసుపత్రి

సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తరలివచ్చే భక్తులకు వైద్య సేవలందించేందుకు మేడారంలో 50 పడకలతో తాత్కాలిక ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి మంత్రి దామోదర రాజనర్సింహ గత నెలలోనే రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ మేరకు మేడారం జాతరలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. మేడారంలోని ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో నిపుణులైన వైద్యులతో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. మేడారం వెళ్లే మార్గంలో 42 వైద్య శిబిరాలు, జాతర పరిసరాల్లో 30 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ప్రతి శిబిరంలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలని, అవసరమైన అన్ని మందులు, ఎమర్జెన్సీ మెడికల్ కిట్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు. జాతరలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, వీలైనంత త్వరగా రోగులను వైద్య శిబిరాలు, సమీపంలోని ఆసుపత్రులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్య శిబిరాల్లో చికిత్స అనంతరం ఉన్నత స్థాయి వైద్యం అవసరమైతే ములుగు, ఏటూరునాగారం, పరకాల ఏరియా ఆసుపత్రులకు, వరంగల్ ఎంజీఎంకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ మేరకు మేడారం జాతరలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# 'i-Pay'గురించి మీకు తెలుసా?

**తెలంగాణ వీణ , జనరల్ :** దేశవ్యాప్తంగా ప్రతిరోజూ వేలాది రైళ్లు నడుస్తుండగా, కోట్లాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. రైల్వేను దేశానికి జీవనాడి అని పిలవడానికి కారణం ఇదే. సాధారణంగా ఐఆర్‌సీటీసీ ద్వారా టికెట్లను బుక్ చేసుకుంటే ముందుగా టికెట్స్ కన్ఫర్మ్ అయినట్లు ఉండదు. కానీ డబ్బులు మాత్రం బ్యాంకు అకౌంట్ నుంచి డెబిట్ అయిపోతుంటాయి. కానీ టికెట్స్ బుక్ చేసుకున్నప్పుడు ముందుగానే చెల్లించకుండానే మీరు రైల్వే టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని మీకు తెలుసా? ఈ ఎంపిక ఐఆర్‌సీటీసీ i-Pay చెల్లింపు గేట్‌వేలో మాత్రమే అందుబాటులో ఉంటుంది. దీనిని 'ఆటోపే' అని పిలుస్తారు. ఇక నుంచి ఐఆర్‌సీటీసీ యాప్/వెబ్‌సైట్ ద్వారా టికెట్ బుక్ చేసుకున్నాక కన్ఫర్మేషన్ రాకపోతే డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. టికెట్ కన్ఫర్మ్ అయ్యాకే కట్టవచ్చు. ఇండియన్ రైల్వే క్యాటరింగ్, టూరిజం ఐపే చెల్లింపు గేట్‌వే ఆటోపే ఫీచర్ యూపీఐ, క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులతో పనిచేస్తుంది. ఇందులో రైల్వే టిక్కెట్‌కు సంబంధించిన పీఎన్‌ఆర్‌ను రూపొందించిన తర్వాత మాత్రమే వినియోగదారు బ్యాంకు ఖాతా నుంచి డబ్బు తీసివేయబడుతుంది. అధిక-విలువైన రైల్వే ఇ-టికెట్లను బుక్ చేసుకునే వారికి లేదా వెయిట్‌లిస్ట్ లేదా తత్కాల్ టిక్కెట్‌లను బుక్ చేయడానికి ప్రయత్నిస్తున్న వారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. ఐఆర్‌సీటీసీ ఈ సదుపాయాన్ని 2021 ప్రారంభంలో ప్రారంభించింది. IRCTC-iPay ద్వారా చెల్లింపు చేయడానికి, వినియోగదారులు వారి UPI బ్యాంక్ ఖాతా డెబిట్ కార్డ్ లేదా ఏదైనా ఇతర చెల్లింపు ఫారమ్‌ను ఉపయోగించడానికి అనుమతి, వివరాలను అందించాలి. వినియోగదారులు ఐఆర్‌సీటీసీలో భవిష్యత్ లావాదేవీల కోసం కూడా ఈ వివరాలను ఉపయోగించవచ్చు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా టిక్కెట్‌లను బుక్ చేసుకుంటే మీరు ఐఆర్‌సీటీసీ ఐపే ద్వారా కూడా తక్షణ రీఫండ్ పొందుతారు. ఐఆర్‌సీటీసీ ప్రకారం.. ఆటోపే యాప్ సదుపాయం వినియోగదారులకు టిక్కెట్లను బుక్ చేయడాన్ని సులభతరం చేస్తుంది. టిక్కెట్ రద్దు విషయంలో వాపసు ప్రక్రియ కూడా సులభం. దీని వల్ల వినియోగదారుల సమయం కూడా ఆదా అవుతుంది. ఒక వేళ మీరు టికెట్స్ బుక్ చేస్తున్న సమయంలో కన్ఫర్మ్ చేసిన టికెట్స్ విఫలమైతే ఆ డబ్బు వెంటనే మీకు రీఫండ్ అందుతుంది.




# ప్లెజెంట్ పిక్ తో తన భార్యకి విష్ చేసిన చిరు



**తెలంగాణ వీణ , సినిమా :** గత కొన్ని రోజులు కితమే మెగాస్టార్ చిరంజీవి తన తన భార్య సురేఖ తో కలిసి యూఎస్ కి చిన్న వెకేషన్ నిమిత్తం వెళుతున్నట్టుగా తెలిపిన సంగతి తెలిసిందే. అలా యూఎస్ లో తమ వెకేషన్ సహా మెగాస్టార్ కొన్ని ముఖ్యమైన పనుల్లో కూడా పాల్గొంటుండగా అక్కడ విషయాలు విశేషాలు ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటున్నారు. మరి అలా లేటెస్ట్ గా మరో బ్యూటిఫుల్ పోస్ట్ పెట్టడం వైరల్ గా మారింది.మరి చిరు తన సతీమణి సురేఖ గారి పుట్టినరోజు సందర్భంగా తమ ఇద్దరిది ఒక బ్యూటిఫుల్ స్నాప్ పెట్టి "నా జీవన రేఖ నా సౌభాగ్య రేఖ నా భాగస్వామి సురేఖ!" అంటూ తన మార్క్ స్టైల్ లో నా లైఫ్ లైన్ నా గ్రేటెస్ట్ పిల్లర్ అయినటువంటి సురేఖకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని తాను తెలిపారు. దీనితో ఈ ప్లెజెంట్ పిక్ తో కూడిన ఈ పోస్ట్ ఫ్యాన్స్ లో మరింత ఆనందాన్ని నింపింది.

# బన్నీ వల్ల ఎన్టీఆర్ కి ఎలాంటి ఇబ్బంది లేనట్టేనా.!

**తెలంగాణ వీణ , సినిమా :** ప్రస్తుతం మన టాలీవుడ్ సినిమా నుంచి రాబోతున్న మాసివ్ అండ్ అవైటెడ్ చిత్రాల్లో స్టార్ హీరోస్ పాన్ ఇండియా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న సెన్సేషనల్ సీక్వెల్ చిత్రం "పుష్ప 2" ఒకటి కాగా ఈ బన్నీకి క్లోజెస్ట్ ఫ్రెండ్ మరియు తాను ఆప్యాయంగా బావా అని పిలుచుకునే యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటిస్తున్న సాలిడ్ యాక్షన్ డ్రామా "దేవర" కూడా ఒకటి అయితే దేవర చిత్రం రీసెంట్ గానే ఏప్రిల్ నుంచి అక్టోబర్ కి పోస్ట్ పోన్ అయినట్టుగా మేకర్స్ కన్ఫర్మ్ చేసిన సంగతి తెలిసిందే.

కానీ ఈ చిత్రం ఎప్పుడు రిలీజ్ అవ్వాలి అనేది మళ్ళీ అల్లు అర్జున్ నటిస్తున్న పుష్ప 2 మీద ఆధారపడి ఉందని టాక్ వచ్చింది. అయితే ఈ రూమర్స్ పై ఇప్పుడు క్లారిటీ వినిపిస్తుంది. రెండు సినిమాలు కూడా ఆన్ వస్తాయని పుష్ప 2 యూనిట్ సినిమాని ఎట్టి పరిసితులో జూన్ నాటికి టాకీ పార్ట్ అంతా కంప్లీట్ చేసేయాలని డెడ్ లైన్ పెట్టుకున్నారట. దీనితో సినిమా ఆగస్ట్ లో తప్పకుండ వచ్చేస్తుందని సమాచారం. దీనితో దేవర రిలీజ్ కి ఎలాంటి ఇబ్బంది లేదనే చెప్పొచ్చు.





# ప్రభాస్ "కల్కి" పై సాలిడ్ బజ్.!

**తెలంగాణ వీణ , సినిమా :** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకోణ్ అలాగే దిశా పటాని సహా యూనివర్సల్ హీరో కమల్ హాసన్ మరియు అమితాబ్ బచ్చన్ లాంటి భారీ తారాగణం నటిస్తున్న వరల్డ్ క్లాస్ చిత్రం "కల్కి 2898ఎడి" కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రం ఆల్ మోస్ట్ చివరి దశకి వచ్చింది. అయితే ఈ చిత్రం కోసం మేకర్స్ ఆల్రెడీ మే రిలీజ్ డేట్ ని లాక్ చేసేసిన సంగతి తెలిసిందే. మరి ఈ డేట్ లో ఈ చిత్రం వస్తుందా లేదా అనే డౌట్స్ కూడా స్టార్ట్ అయ్యాయి. అయితే దీనిపై క్లారిటీ వినిపిస్తుంది. కల్కి డెఫినెట్ గా అనుకున్న డేట్ కే రాబోతుంది అని మేకర్స్ కూడా ఆ డేట్ ని దృష్టిలో పెట్టుకొనే రెండు నెలల ముందే అగ్రెసివ్ ప్రమోషన్స్ ని వరల్డ్ వైడ్ గా కూడా ప్లాన్ చేస్తున్నారని టాక్. దీనితో కల్కి వాయిదా వార్తల్లో అయితే ప్రస్తుతానికి ఎలాంటి నిజం లేదని చెప్పాలి. ఇక ఈ భారీ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తుండగా వైజయంతి మూవీస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.





# "హను మాన్" ఓటిటి రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యిందా?



**తెలంగాణ వీణ , సినిమా :** యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో తేజ సజ్జ హీరోగా యంగ్ హీరోయిన్ అమృత అయ్యర్ హీరోయిన్ గా దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన టాలీవుడ్ ఫస్ట్ సూపర్ హీరో చిత్రం "హను మాన్". మరి సాలిడ్ హైప్ నడుమ రిలీజ్ అయ్యిన ఈ చిత్రం ఏకంగా 300 కోట్లకి పైగా వసూళ్లు రాబట్టి ఒక బిగ్గెస్ట్ హిట్ గా ఊహించని రికార్డులు సెట్ చేసింది. మరి మేకర్స్ మొదటి నుంచి చెప్తున్నట్టుగా ఈ సినిమా లాంగ్ రన్ సినిమా గానే నిలిచింది.దీనితో సుమారు రెండు నెలల మేర సమయాన్నే ఓటిటి రిలీజ్ కి తీసుకున్నారు మేకర్స్. అయితే ఇది వరకే ఈ చిత్రం ఓటిటి రిలీజ్ మార్చ్ నెల లోనే అని ఫిక్స్ అవ్వగా ఇపుడు డేట్ కూడా వినిపిస్తుంది. దీని ప్రకారం ఈ మార్చ్ 2 నుంచే స్ట్రీమింగ్ యాప్ జీ 5 లో అందుబాటులోకి వస్తుంది అని టాక్. మరి దీనిపై అఫీషియల్ అప్డేట్ రావాల్సి ఉంది. ఇక ఈ భారీ చిత్రానికి గౌర హరీష్ సెన్సేషనల్ మ్యూజిక్ ని అందించగా నిరంజన్ రెడ్డి నిర్మాణం వహించారు.

# "విశ్వంభర" కి ఓవర్సీస్ లో సెన్సేషనల్ డీల్ పూర్తి.!

**తెలంగాణ వీణ , సినిమా :** మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఇప్పుడు చేస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం "విశ్వంభర". ఈ సినిమా అనౌన్స్ చేసిన నాటి నుంచి కూడా సెపరేట్ అంచనాలు పెట్టుకొని సిద్ధం అవుతుండగా ఒకో అప్డేట్ తో అయితే మళ్ళీ మెగాస్టార్ తన రేంజ్ సినిమా చేస్తే ఎలా ఉంటుందో ఈ సినిమా చూపిస్తుంది అని మెగా ఫ్యాన్స్ అంతా కూడా చాలా గట్టి నమ్మకంతో ఉన్నారు.దీనితో ఈ సినిమా విషయంలో సినీ వర్గాల్లో కూడా ఇదే రేంజ్ లో హైప్ ఉండగా ఈ చిత్రం బిజినెస్ కి సంబంధించి లేటెస్ట్ అప్డేట్ తెలుస్తుంది. ఈ సినిమాకి యూఎస్ మార్కెట్ లో భారీ మొత్తంలో డీల్ లాక్ అయ్యినట్టుగా కన్ఫర్మ్ అయ్యింది. ఈ చిత్రాన్ని సరిగమ సినిమాస్ సంస్థ వారు ఏకంగా 4 మిలియన్ డాలర్స్ వెచ్చించి కొనుగోలు చేశారట. ఈ చిత్రం పట్ల తాము చాలా నమ్మకంగా ఉన్నారని అలాగే తాము మొత్తాన్ని ఈ సినిమా డెఫినెట్ గా రీచ్ అవుతుందనే నమ్మకంతో తీసుకున్నట్టుగా తెలిసింది.




# చిన్న యాంకరే అనుకున్నారు.. ఇప్పుడు 125 కోట్లకు అధిపతయ్యాడు.!

**తెలంగాణ వీణ , సినిమా :** కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరంలేదు. ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా నటుడిగా సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి కోట్లాది అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించుకున్నాడు ఈ హీరో. నటనపై ఆసక్తితో ఇండస్ట్రీలోకి రావాలనుకుంటున్న యువకులకు శివకార్తికేయన్ రోల్ మోడల్. బుల్లితెరపై యాంకర్ గా మొదలుపెట్టిన ప్రయాణం ఇప్పుడు వెండితెరపై స్టార్ గా గుర్తింపు తెచ్చే వరకు తీసుకొచ్చింది. మెరీనా సినిమాతో హీరోగా తెరంగేట్రం చేసిన ఈ హీరో ఇప్పుడు తమిళ చిత్రపరిశ్రమలో స్టార్‌గా దూసుకుపోతున్నాడు. ఇప్పుడు తనకంటూ క్రేజీ ఇమేజ్‌ను వచ్చేలా చేసుకున్నాడు. ఒక్క యాక్టింగ్ మాత్రమే కాదు సూపర్ సింగర్, రచయితగా కూడా గుర్తింపు తెచ్చుకున్నాడు ఈ స్టార్ హీరో. ఇక యాంకర్గా చాలా తక్కువ సంపాదనతో తన కెరీర్‌ను మొదలెట్టిన ఈ స్టార్ హీరో.. ప్రస్తుతం ఒక్కో సినిమాకు శివకార్తికేయన్ 25 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటున్నాడు. అంతేకాదు ఇండస్ట్రీలోకి అడుగెట్టిన 11 ఏళ్లలోనే దాదాపు 125 కోట్ల ఆస్తి వరకు సంపాదించుకున్నాడు. కార్లంటే ఇష్టం ఉండడంతో... బ్రాండ్ న్యూ లగ్జరీ కార్లను సొంతం చేసుకున్నాడు. అంతే కాకుండా షేర్ మార్కెట్, ప్రొడక్షన్ కంపెనీ అంటూ బిజినెస్ కూడా మొదలెట్టాడు ఈ హీరో.

